# కర్త-కర్మ-క్రియ!

విహారి & శాలివాహన



మళ్లీ టైం చూసుకున్నాడు మధుసూదనం. ఆరూ పదిహేడైంది.

ముసలివాని శౌర్యంవలే, సాయంసూర్యుని ప్రతిభకూడా తగ్గి, కిరణాలు చిన్నబోతున్నై.

'గమ్యాన్ని బారెడుదూరంలో ఉంచుకుని గూడా ఆ దూరాన్ని అధిగమించటానికి అంత జాప్యం చేస్తాడెందుకో ఈ ముసలి సూరన్న' అనుకున్నాడు మధుసూదనం.

వీధి చివరికి చూస్తున్నవాడల్లా వెనుదిరిగి ఇంటివైపు చూశాడు. గడియపెట్టబడిన తలుపుకు తాళం వ్రేళాడుతోంది. వరండావరకూ వెళ్లి కిటికీలోనుంచి లోపలికి చూశాడు. టేబులుమీద పుస్తకాల సంచీలేదు. వెంటనే వెనుదిరిగివచ్చి ఇంటిముందు అటూ ఇటూ పచార్లు చేయడం మొదలెట్టాడు.

ఉమ యింకా ఎందుకు యింటికి చేరుకోలేదో అతనికి అర్థంకాలేదు. అతనికెందుకో భయం భయంగావుంది. మనసులోని దిగులు పరికొంచెం లావైంది.

తను ఎన్నోసార్లు చెప్పేడు స్కూలు మూసేయగానే ఇంటికి చేరుకోమని. ఉమ మాట్లాడదు. నవ్వుతుంది. అందంగా, తీయగా చిలిపిగా నవ్వుతుంది. 'తల్లిపోలిక' అనుకున్నాడు.

'అనవ్వులోనూ, రూపంలోనూమాత్రమే' అని సవరించుకున్నాడు. అంతకుమించి ఉమ తల్లినిపోలటం అతని కిష్టంలేదు.

ఉమ స్కూలునుంచి రావడం క్షణం ఆలశ్యమైతేచాలు మనసుకు పిచ్చెత్తినట్లుగా వుంటుంది. ఎందుకో అతనికి అర్థంకాదు. కాని, కారణం కనిపెట్టాలని ఆలోచిస్తే మాత్రం అతని కనిపిస్తుంది. 'దీనికంతటికి కారణం సరోజ' అని.

మధుసూదనానికి మొహం ఎర్రబడింది. సరోజ జ్ఞాపకం వచ్చి, ఆమెమీద కోపంతో ఉడికిపోయాడు.

''నాన్నా! నాన్నా!!'' మధుసూదనం తేరుకున్నాడు. ఎదురుగా కూతురు. అసగింట

నుంచి తను ఎదురు చూసిన ఉమ.

"వచ్చావా ఉమా! నా పిచ్చి ఉమా! ఇవాళ ఇంత ఆలస్యం చేశావేం తల్లీ" ఉమను దగ్గరకు తీసుకుని, ఆమె వీపును చేత్తో నిమిరాడు ఆప్యాయంగా.

ఉమ మాట్లాడలేదు. తండ్రి తనని అలా దగ్గరకు తీసుకున్నప్పు డెందుకో పరాకుగా ఉండిపోతుంది. బహుశః తల్లి జ్ఞాపకం వస్తుందేమో

ఉమ మాట్లాడకుండా సంచీలోని తాళం చెవిని వెదికి తండ్రిచేతి కిచ్చింది. మధుసూదనం తాళంతీసి లోపలికి నడిచాడు, ఉమ భుజంమీద చేయివేసి నడిపిస్తూ.

* * *

ప్రొద్దుటినుంచి తలుపులు మూసి ఉంచటంవల్లగాబోలు ఇంట్లోకి అడుగు పెట్టగానే వెచ్చని ఆవిరి కొట్టింది మధుసూదనానికి. 'గుంయ్' మంటూ ఈగల లాంటి దోమలు అతని మొహంముందుకు వచ్చి స్వాగతం పలికాయి. ఇంట్లోనుంచి మాగుడు వాసనవచ్చి అతన్ని చుట్టి వేసింది.

మధుసూదనం లైటు వేశాడు. గది అంతా వెల్తురుతో నిండిపోయింది. గదిలో సామానంతా చిందర వందరగా వుంది. నడుస్తుంటే కాళ్ళక్రింద ఇసుక గరగర మంటోంది. మధుసూదనం గట్టిగా నిట్టూర్చాడు.

ఉమ తండ్రివైపు చూసింది. మధుసూదనం ఇంకా ఇంటి పరిస్థితిని పరికిస్తూనే ఉన్నాడు. ఉమ పుస్తకాల సంచిని టేబులుమీదపెట్టి,క్రిందపడి వున్న పుస్తకాల్ని, గ్లాసుల్ని తీసి, ఎక్కడి వాటి నక్కడ పొందికగా అమర్చింది. చీపురు తీసుకుని గదినంతా శుభ్రం చేసింది.

మధుసూదనం అప్పటికి వూపిరి పీల్చుకో గలిగేడు.

తండ్రి ముఖం ప్రసన్నం కావడం ఉమకు కొండంత సంతోషాన్ని కలిగించింది. నోరు విప్పి మాట్లాడడానికి కొంచెం ధైర్యం వచ్చింది. "ఇవాళెందుకో సీత రాలేదు నాన్నా" అంది.

"రేపు రాసి పెడ్తా. మాన్పించి వేస్తాను. తిక్క కుదుర్తుంది."

* * *

తండ్రిమాటలకి ఉమ బిక్కమొహం వేసింది. అది చూసి మధుసూదనం "పోనీలేమ్మా. దిగులెందుకు, మరోమనిషి దొరక్కపోతుందా మనకు. లేకపోతే...చెప్పా పెట్టకుండా పనికి రావడం మానేస్తుందీ! ఇబ్బంది పడిపోతామని తెలీదూ?" అన్నాడు.

"ఏదో ఇబ్బందివల్లనే రాలేకపోయుంటుంది నాన్నా!" అనేసి అక్కడ్నుంచి వెళ్లిపోయింది ఉమ.

మధుసూదనానికి తెలుసు. ఉమకు సీత అంటే ప్రాణమని. సీతను పని మనిషిగా కాకుండా ఒక ఆత్మీయురాలిగా, ఉమ భావిస్తుంది. సీతగూడా ఉమని ఆప్యాయంగా చూసుకుంటూ, ఇంటిపనిమనిషిగా కాకుండా ఇంట్లోని ఒక వ్యక్తిగా మసలుతుంది. పదేళ్ళు నిండని ఉమను యజమానురాలిగానూ గౌరవిస్తుంది. స్నేహితురాలిగానూ సహాయం చేస్తూ అండగా ఉంటుంది. శ్రేయోభిలాషిగా సలహా లిచ్చే సీతను ఉమ తల్లిరూపంలో చూస్తుంది. మధుసూదనానికి తెలుసు వాళ్ల అనుబంధం. వారిద్దరూ అలా దగ్గరగా వుండటం తన అంతస్తుకు గౌరవహీనమని అప్పుడప్పుడు అనుకున్నా, వారి అనుబంధాన్ని అతనెన్నడూ విడదీయాలనుకోలేదు. అలా అనుకోక పోవడంలో అతని స్వార్థం లేకపోలేదు. పసితనమనే తెల్లని మేలిముసుగులో నుంచి ప్రపంచాన్ని చూసి అర్థం చేసుకోవలసిన వయసు ఉమది. తనకు తెలియని, తెలుసుకోతగిన విషయాలెన్నో తల్లిదగ్గర నేర్చుకోవలసిన వయసది. తల్లికాకపోతే తల్లిలాంటిమరో తల్లిదగ్గర ఉమకా అవకాశం లభించిందికదా అని సమాధానపడేవాడు మధుసూదనం.

అలా తను సమాధానపడినా అప్పుడప్పుడూ ఉమతల్లిని తలపోస్తున్నట్లనిపిస్తుందతనికి. తన ముద్దులకూతురు తల్లికోసం బెంగపెట్టుకుంటుంది. అప్పుడతనికి బాధ కలుగుతుంది.

తనబాధకు కొలమానం [illegible] కాదూ?

"ఉమా!" ఏదో జ్ఞప్తికి వచ్చి పిలిచాడు మధుసూదనం.

"ఆ" ఉమ పలికింది లోపల్నుంచి. పలికిన ఆ కంఠం వణికింది. మధుసూదనం ఆదుర్దాగా అక్కడకు వచ్చాడు. ఉమ ఓమూలగా గువ్వలా కూర్చుని వుంది.

"ఏమిటమ్మాయ్"

ఉమ నవ్వింది. "చన్నీళ్ళ స్నానంచేసి వచ్చాను నాన్నా. అందుకని..... చలి......"

"పిచ్చిపిల్లా" మధుసూదనం నవ్వుకున్నాడు. ఇప్పుడు తనూ స్నానంచేయాలి, ఎలా?

సరోజ అలవాటు అది. అర్ధరాత్రి అయినా, పిడుగులతో వర్షం పడుతున్నాసరే అందరూ స్నానం చేయాల్సిందే.

సీతవుంటే వేన్నీళ్ళు పెట్టేది. అలవాటుగా. ఉమ, తనూ స్నానంచేసేవాళ్ళు.

ఇవాళ సీత రాలేదు. అయినా ఉమ ఆ అలవాటును మానలేక పోయింది. ఆ అలవాటు తల్లినేర్పింది. అంటే ఉమతల్లిని మర్చిపోలేదన్నమాట మరి తను? తనుసరోజను మర్చిపోగలడా? కుమార్ ముద్దుమాటల్ని మర్చిపోగలడా? కాని. ... ..కాని...సరోజ మర్చిపోగలదు తనను, ఉమను మర్చిపోగలదు. మర్చిపోయింది కూడా.

"స్నానం చేసిరా నాన్నా" ఉమ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు మధుసూదనం. ఉమ పరికిణీ, జాకెట్టూ తొడుక్కుని తలదువ్వుకుంటోంది. అద్దంలోనుంచి ఉమ మొహం కనిపించింది. గభాలున చూస్తే సరోజ మొహమేమో ననిపిస్తుంది. సరోజ మొహంచూపి సరిగ్గా సంవత్సరమైంది. ఒక్కసారైనా చూసి వెళ్ళిందా? కనీసం ఓ ఉత్తరం ముక్కైనా వ్రాసిందా? తెగిపోయిన బంధం. బంధంతెగ్గాలి. బ్రతుకులేమైతే తనకేం?

"స్నానానికి వెళ్ళలేదేం నాన్నా? నీకూ చలివేస్తుందా?" ఉమ నవ్వింది.

"అదేం లేదమ్మా. నాకు చలేమిటి" అంటూ పెరట్లోకి నడిచాడు మధుసూదనం.

వెన్నెలలేని చీకటిరేయి చిక్కగా, నల్లగా ప్రియురాలికళ్ళకాటుకలాగా ఆవరించివుంది.

ప్రక్కభాగంలోని రమణయ్యగారు అప్పుడే వచ్చారు లావుంది, కారు షెడ్‌లో పెడుతున్నారు.

మేడ పైభాగంలోని దంపతులు ఏవో కబుర్లు చెప్పుకుంటూ పకపకలాడుతున్నారు.

ఆవాతావరణంలోని మధుసూదనం కళ్ళ



## శుభ వార్త

కడుపులో నొప్పి, తలనొప్పి, చర్మవ్యాధులు, వంధ్యా వ్యాధులకు ప్రత్యేక చికిత్స. నాడీ పరీక్షతో వ్యాధిని నిర్ణయింతురు. సర్వ మొండి వ్యాధులకు మా వైద్యశాల ప్రధాన వైద్యులు డా॥ ఎన్. ఎస్. రావుగారు క్రింది విధముగా బస చేయుదురు. ఉ॥ 7 గం॥ నుండి సా॥ 3 గం॥ వరకు సంప్రదించవచ్చును. పరీక్ష ఫీజు రు. 5/-మందు ఖరీదు వేరు. 1 వ తేదీ: కర్నూలు: ఉడ్‌లాండ్స్ హోటల్. 2 వ తేదీ: నంద్యాల: సెలెక్ హోటల్ 3 వ తేదీ ఆదోని: పేలస్ హోటల్. 4 వ తేదీ గుంతకల్లు. బృందావన్ లాడ్జి. 5, 6 తేదీలు బళ్లారి గార్డెన్ హోటల్. 7 వ తేదీ: అనంతపురం రాయల్ రిఫ్రెషింగ్ రూమ్స్, బద్రి బిల్డింగ్స్, బళ్లారి రోడ్ 8 వ తేదీ మదనపల్లి అశోక హోటల్. 9, 10 తేదీలు బెంగుళూరు: మద్రాసు ఉడ్‌లాండ్ హోటల్, సంపెంగ టాంక్ రోడ్. 11 వ తేదీ చిత్తూరు. ఓరియంటల్ లాడ్జి 12 వ తేదీ: కడప అప్సర్ హోటల్ 13 వ తేదీ: తిరుపతి. బాలాజి లాడ్జి. 14 & 15 తేదీలు మద్రాసు. హోటల్ హరినివాస్ (మోడరన్ కేఫ్), 4, తంబు చెట్టి వీధి. 16 వ తేదీ: నెల్లూరు: అజంతా హోటల్. 17 వ తేదీ ఒంగోలు. కృష్ణాలాడ్జి, సంతపేట. 18 వ తేదీ గుంటూరు: ఉడిపి శ్రీకృష్ణ లంచ్ హోమ్, కృష్ణా మహల్ ఎదురుగా. 19 వ తేదీనుండి: హెడ్డాఫీసు: హైదరాబాదు.

రావూస్ ప్రోడక్ట్స్, హైదరాబాద్-4 (H.O) బ్రాంచి. కర్నూలు. బుధవారపుపేట.


# కర్త-కర్మ-క్రియ!

సులో ముల్లు గుచ్చుకుంది.

"నాన్నా!" ఉమ అతన్ని పిల్చింది.

"ఏమ్మా"

"ఈపూటకూడా గోపాలంచేత క్యారియర్ తెప్పించనా?"

క్షణం మౌనంగావుండి అన్నాడు మధుసూదనం "తప్పేదేముందమ్మా? తెప్పించు" ఒకరిమీద ఆధారపడితే జీవితం యింతే అనుకున్నాడు మధుసూదనం సీత రాకపోవడంవల్ల తమకెంత ఇబ్బంది కలిగిందీ రోజు! పాపం గోపాలం మంచివాడుకాబట్టి ప్రొద్దుట అడగంగానే క్యారియర్ తెచ్చిపెట్టి పుణ్యంకట్టుకున్నాడు. ఈపూట కూడా తెచ్చిపెట్టకపోతాడా? టవలుతో వళ్లు తుడుచుకుంటూ అనుకున్నాడు మధుసూదనం.

మధుసూదనానికి సరోజగుర్తు వచ్చింది మళ్లీ. గోపాలాన్నిగురించి అనుకున్నప్పుడల్లా సరోజ గుర్తువస్తుంది. తనకప్పుడప్పుడు అనుమానం కలుగుతూవుంటుంది. తనకంటేగోపాలం తెలివిగలవాడేమోనని. గోపాలంభార్య గవర్నమెంటు హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తోంది. గోపాలమే డి. యం. వో. గారి కాళ్లావేళ్లాపడి భార్యకు ఉద్యోగమిప్పించాడని చాలామంది అనుకుంటారు. మరితను? అదృష్ట్యా గోపాలం తెలివి కలవాడా లేక..........

"నాన్నా" ఉమపిలుపు అతని ఆలోచనల్ని త్రెంపివేసింది.

ఉమక్యారియర్‌తీసి రెండుపళ్లేలలోనూ అన్నంవడ్డించింది. మధుసూదనం కూర్చున్నాడు. అన్నం అంతా మెదాపిండి ముద్దలా వుంది. కూరలు ఏకూరలయిందీ చెప్పలేనంతగా రూపాన్ని,రుచినీ పోగొట్టుకున్నై. మరి సంవత్సరం నుంచి తాము ఆరగిస్తున్న ఆహారం ఇదే.

తన కిష్టమైనవిధంగా వంటచేసి ప్రక్కన కూర్చుని కొసరి కొసరి తినిపించే సరోజ రూపం అతనికళ్లకు కట్టింది.........ఈ హొటలు మెతుకుల్ని తనే తినలేక




## హమామ్ వల్ల తాజాగాను కాంతిగాను వుండండి




వాడకముతో చాలా రోజులు వచ్చే టాయిలెట్ సబ్బు

హమామ్‌తో రుద్దుకొని ప్రతి దినము స్నానము చెయ్యండి. హమామ్ మీ శరీరమును శుభ్రపరచుటయే గాక, దానికి కాంతినిచ్చి, హాయిని గొల్పును. ప్రతిరోజూ హమామ్ వాడండి...ఈ సబ్బు మాత్రమే వాడకానికి చాలా రోజులువస్తుంది.

టాటా ఉత్పత్తి

కోతుంటే పాపం ఉమ ఎలా పోట్లవింపు కుంటోందో.........

ఉమచేయికడుక్కుంది. మధుసూదనం మనసు చివుక్కుమంది. "అప్పుడే చేయి కడుక్కున్నావేం, ఉమా?"

"సహించలేదునాన్నా. స్కూల్లో ఇవాళ పిల్లలందరికీ టీపార్టీ చేశారు."

మధుసూదనం కొంతవరకు మనసును కుదుటపర్చుకున్నాడు. తను కూడా భోజనం ముగించుకుని లేస్తూ "ఏమిటీ విశేషం స్కూల్లో" అనడిగేడు.

ఉమ గిన్నెల్ని ఒకదానిమీద ఒకటి పర్చుతూఅంది. "మావెంకటరత్నం మేష్టారు లేరూ, ఆయున్ని గుంటూరు ట్రాన్స్ఫర్ చేశారు. అందుకని....."

"అలాగా. అరే పాపం. చాలామంచివాడ మ్మాయ్, ఎందుకువేసేరో అంతదూరం" కుతూహలాన్ని కనబరిచేడు మధుసూదనం.

"ఆయన భార్యకి ఉద్యోగం వచ్చిందిట నాన్నా అక్కాళ్లో"

ఉమ సమాధానానికి మధుసూదనం గతుక్కుమన్నాడు.

పక్కమీద పడుకున్నాడేగాని మధుసూదనానికి నిద్రపట లేదు. ఏవేవో ఆలోచనలు. ఏవేవో స్మృతులు దోమల్లాగానే సవారీ చేస్తున్నాయి.

కొంతమందికి ఇష్టమైన పనులు మరి శరికి అయిష్టాన్ని గలిగిస్తై. ఎదుటి వారిపనులు మనకు అయిష్టంగా తోచి నప్పుడు మన అయిష్టతను వ్యక్తంచేసి వారిని అపస్లు చేయనివ్వము. కాని అయిష్టతను మనం వ్యక్తం చేయలేకపోయినా, లేక మనమాటను వారు లెక్కచేయకపోయినా మనసుకు కష్టం తప్పదు. ఇరువురికీ సామరస్యం కుదరనప్పుడు, సర్దుకపోదామని అనుకోటం లొంగిపోవడమేమోనని భావించి నప్పుడు దారులువేరుకాక మానాయా?

"ఎల్లుండి నుంచి శలవులునాన్నా!" ఉమ దుప్పటి కప్పుకుంటూ అంది. మధుసూదనం విన్నాడు. విని ఓక్షణం ఏమీ మాట్లాడలేదు. ఉమ ఆసంగతి ఎందుకు చెప్పిందో అతనికి అర్థమైంది. శలవుల్లో నైనా అమ్మనొకసారి చూసిరావాలని ఆపసిదానిఆరాటం. అమ్మను చూడాలంటే శలవు రానక్కర్లేదని ఆపసిహృదయానికి తెలీదుపాపం. శలవులు లేనందువల్లనే కాదుగా సరోజ ఇక్కడకురానిది. కాని.....

"నాన్నా!"

"ఆ విన్నానమ్మా"

ఉమ ఇక మాట్లాడలేదు. కొంచంసేపు అటూఇటూ మసిలి నిద్రపోయింది.

మధుసూదనం గంటసేపు ఆలోచించాడు. ఇలాంటి గంటలు ఇదివరకుఎన్నో ఆలోచించాడు. సంవత్సరం నుంచీ ఆలోచిస్తూనే వున్నాడు కాని సమస్య తెగటం లేదు. తను ఏమీచేయలేక పోతున్నాడు. ఒకసారి ఏర్పడిన భావనల్ని, వెలిబుచ్చిన అభిప్రాయాల్ని కాదని ఇప్పుడు రాజీపడలేక పోతున్నాడు. కాలం తనకనుకూలంగాకలసి రాకపోతుందా అనే ఆశాభావంతోనే ఇంత కాలం గడిపేడు.

"అమ్మా! అమ్మా!!"

ఉమ కలవరించింది. అతనిగుండెల మీద సమ్మెటతో కొట్టినట్లైంది. మధుసూదనం నిట్టూర్చేడు.

అతనికి తెలుసు అది కలవరింతేఅయినా పసిహృదయం లోనుంచి పైకుబికిన ఆవేదనని.

అతనిమనస్సు ఉమను వదలి సలక్షైళ్ళ ప్రయాణించింది.

* * *


సరోజ ఇంటికొచ్చేసరికి చాలాపొద్దుపోయింది. అలా ప్రొద్దుపోయి ఇంటికి రావడం ఆమెకుబాగా అలవాటయింది. ఇటీవల రంగరాజమ్మగారితో స్నేహం కలిసిన తర్వాతనే ఆమె ఇలా ప్రొద్దుపోయి ఇంటికిరావడం. రంగరాజమ్మగారు కలెక్టరు గారి సతీమణి. మహిళామండలి అధ్యక్షురాలు. మరి ఆవిడ కూర్చోబెట్టి మాట్లాడుతుంటే కాదని ఎలారాగలదు సరోజ మాత్రం? అదీగాక ఆవిడమాట్లాడుతుంటే సరోజకు హాయిగా తీయగా జాతిస్వరానికి నాగస్వరం వూదినట్లుగా వుంటుంది. వాక్చాతుర్యముతో బాటు మాట్లాడుతూనే ఎదుటివారి హృదయాల్లోని నిగూఢమైన రహస్యాల్ని ఇట్టే చదివేయగల నేర్పు రంగరాజమ్మ గారికి వుందని సరోజకుతెలుసు.

రవణమ్మగారికి ఇవన్నీ తెలీవు. ఆమె తెలుసుకున్నదల్లా ఒకటే, వ్యర్థమైన కబుర్లతోకాలాన్ని వృథాచేస్తూ సరోజ ఆలస్యంగా ఇంటికి వస్తోందని.

సరోజ వచ్చి రాగానే కుర్చీలో కూలబడి కణతల్ని చేతివేళ్లతో నొక్కుకుంటూ కూర్చోటం గమనించింది రవణమ్మ గారు.

"ఏమిటే అలావున్నావ్. వొంట్లో బాగోలేదా" అని అడిగింది కూతురుకు దగ్గరగా వచ్చి.

సరోజ తలపైకెత్తి చూసింది "ఏమీ



లేదమ్మా! తలనొప్పిగా వుంది అంతే"

రవణమ్మగారికి కూతుర్ని దెప్పటానికి అవకాశం దొరికింది సరోజఅంటే ఆవిడకి ఎంత అభిమానమున్నా, ఇటీవల ఎందుకో, సరోజ ప్రవర్తన ఆమెకు అసంతృప్తిని కలిగిస్తున్నది అయినా ఆవిడ ఏమీ మాట్లాడదు మాట్లాడినా, తన మాటకు విలువవుండదని ఆమెకుతెలుసు

"గంటలతరబడీ కబుర్లుచెప్పుకుంటూ కూచుంటే తలనొప్పేం ఖర్మ, కొంతకాలానికి పిచ్చికూడా పుడుతుంది"అంది

మరోసమయంలో ఐతే తల్లితోవాదనకు దిగి, తనేమీ అనవసరమైన కాలయాపన చేయడంలేదని ఆమెను నమ్మించే దేగావి, ఇప్పుడు అందుకు తలపడదలుచుకోలేదు సరోజ శరీరమంతా చితుకగొట్టినట్లు నొప్పులుగావుంది మనసుకు విసుగ్గా వుంది, అందుకని తల్లికి సమాధానం చెప్పకుండానే మాటనుమారుస్తూ "కుమార్ నిద్రపోయాడా" అని అడిగింది

"నిద్రపోక ఎంతసేపని కూర్చుంటాడు వాడుమాత్రం. నీకోసం ఎదురు చూసి చూసి ఇప్పుడే పడుకున్నాడు" అంది రమణమ్మ గారు.

"ఆకలవుతోంది అన్నంపెట్టు, స్నానం చేసివస్తాను" సరోజ లేచింది

"తలనొప్పిగా వుందంటూ ఇప్పుడు స్నానం చెయ్యకపోతేనేం?"

తల్లిప్రశ్నకు జవాబు చెప్పకుండానే సరోజ మౌనంగా అల్మారులోని సబ్బుపెట్టెను తీసుకొని స్నానాలగదికి వెళ్లింది

"నామాట ఎందుకు వింటావులే నీవు" అంటూ వంటగదికి దారి తీసింది రవణమ్మగారు.

రవణమ్మగారు రెండు కంచాల్లోనూ అన్నం వడ్డించింది అది చూసిన సరోజ మొదట ఆశ్చర్యపోయింది. ఆయనగారు లేరు గదా మరి రెండో కంచం ఎవరికి అనుకుంది. అంతలోనే తన ఆలోచనకు తనే నవ్వుకుంది. ఇలా పొద్దుపోయిన రోజు తనతోపాటు తల్లి కూడా వడ్డించుకుంటుంది

సరోజకు భర్త జ్ఞాపకం వచ్చాడు. తామి

# కర్త-కర్మ-క్రియ:!

ద్దరూ ఆవిధంగా ఎదురెదురుగా కూర్చుని భోంచేసిన రోజులు జ్ఞప్తికి వచ్చాయి

"కూర్చోవేమే నిల్చుని అలాచూస్తావేం?" అంది రవణమ్మగారు, ఒక కంచాన్ని ముందుకు లాక్కుంటూ

ఆలోచనల్ని విదిలించుకుంటూ కూర్చుంది సరోజ "నీ వింకా అన్నం తినలేదూ?" అని అడిగింది తల్లివైపు జాలిగా చూస్తూ పాపం, ఆవిడసలే రోగిష్టి మనిషి అప్పుడప్పుడూ రక్తపుపోటు వస్తూ వుంటుంది ఇంటెడు చాకిరి మీద పడటంతో ఆవిడ మరీ నలిగినట్లు కనిపించింది సరోజకు

"కూతురికి అన్నం పెట్టకుండా ఏతల్లి అన్నం తింటుందే" అన్నది రవణమ్మగారు సరోజ ముఖంలోకి చూస్తూ

చెళ్లున కొట్టినట్లయింది సరోజకు ఉష గుర్తుకు వచ్చింది ఎలా వుంటుందో, ఎలా చదువుకుంటుందో, తను దగ్గర లేకపోవడంవల్ల ఎన్ని ఇబ్బందులు పడుతోందో ననిపించింది అంతలోనే తల్లి మాటల్లోని వ్యంగ్యం స్ఫురించి అవమానంతో కుచించుకపోయింది తలవంచుకుని అన్నం ముద్దను నోట్లో పెట్టుకుంది

"నాకు తెలీక అడుగుతానుగానీ, ఎన్నాళ్లీ పంతాలు? ఉహూ తెలుస్తున్న పిల్లల్ని చెరొకరు అట్టే పెట్టుకుని ఎవరి దారిన వాళ్లు ఉద్యోగాలు చేసుకుంటూ, వూళ్లేలుతుంటే ఆపిల్లల మనసులు విరిగిపోవూ?"

సరోజ తల్లివైపు చూసింది కోపంగా రవణమ్మగారు తలదించుకుని అన్నం కలుపుకుంటోంది. క్షణంసేపు ఇరువురు మాట్లాడలేదు సరోజకు అన్నం తినాలనిపించలేదు. కాని తినకుండా లేచిపోతే తల్లి బాధపడుతుంది ఆమె కూడా తినకుండా లేస్తుంది

"అయితే, కాపురం చేసుకోటం కంటే నీకీ వుద్యోగం చేసుకోవడమే హాయిగా వుందా?"

సరోజ ఇక సహించలేకపోయింది "నీకెన్నిసార్లు చెప్పేను ఆ విషయాల్ని కదపవద్దని? ఎవరి బాగోగులు వాళ్లు చూసుకోగలరు. నీవేం వుద్ధరించ నక్కర్లేదు" అనేసి చేయి కడుక్కుని లేచి వెళ్లింది

"ఎవరి బాగోగులు వాళ్లు చూసుకోవడమే కాదు, మరొకరి బాగోగులు చూడవలసిన అవసరం కూడా మీకు వుంది. మనస్పర్థలతో మీ జీవితాల్ని మీరు పాడు చేసుకున్నా, పిల్లల మనసుల్ని కలుషితం చేసి, వాళ్ల భవిష్యత్తును పాడుచేసే హక్కు మీకు లేదు" ఆవేశంగా అంటున్న రవణమ్మగారి మాటలు సరోజకు వినిపించకపోలేదు.

కళ్లు మూసుకుని పడుకుంది సరోజ. ప్రపంచమంతా స్వార్థంతో నిండినట్టు తోచింది ఆమెకు ఆ స్వార్థంతో ప్రతి వ్యక్తి ఒకే కోణంలో నుంచి చూడటం, ఆలోచించటం జరుగుతుంది తాము మారకుండానే తమ కనువైన విధంగా మారమని ఇతరులను వత్తిడి చేస్తుంటారు

సరోజ అది సహించలేదు అందుకే ప్రపంచమంటే ఒకవిధమైన అసహ్యం కోపం ప్రబలిపోయాయి ఆమెలో ఆకోపాన్నీ అసహ్యాన్నీ ప్రదర్శించే మార్గం తోచక పిచ్చెత్తినట్టు అనిపిస్తుందామెకు కసిదీరేలా ఏడుద్దా మనిపిస్తుంది కాని అదీ చేయలేక పోయేది ఇప్పుడూ అదే అవస్థకు లోనైందామె

ప్రక్కకు తిరిగి పడుకుంది సరోజ. అవతల చిన్న మంచంమీద కుమార్ నిద్రపోతున్నాడు నిద్రలోనే నవ్వుతున్నాడు. ఎందుకోమరి వాడు నెలరోజుల నుంచీ నిత్యం అడుగుతున్నాడు "అమ్మా నాన్నగారు ఎప్పుడు వస్తారే", "అక్కయ్య ఏం చేస్తుంటుందిప్పుడు", "నాన్నగారు ఇహ రానేరారా" అని తనేం సమాధానం చెప్తుంది?

'అల్లుడికి ఇష్టం లేనప్పుడు నీవెందుకే వుద్యోగం చేయడం?' అనే తల్లి ప్రశ్నకు ఏం సమాధానం చెప్తుంది?

"భార్యాభర్త లిద్దరూ ఒకే వూళ్లో వుంటూ ఉద్యోగాలు చేసుకోటానికి ప్రభుత్వం సదుపాయాలు చూపెడుతూంది కదా! మరి మీ వారొక చోట, మీరు మరోచోట ఉద్యోగం చేయడమేమిటి? మీరేదో దాగ

న్నట్లున్నారు. నిజం చెప్పండి. నా చేతనైన సాయం చేస్తాను'' అనే రంగరాజమ్మ గారికి ఏం సమాధానం చెప్తుంది?

తను ఎవరి ప్రశ్నకూ జవాబు చెప్పలేదు. చెప్పగలిగినా ఎందుకు చెప్పాలి? తను వుద్యోగం చేయడం ఆయన కెందు కిష్టం వుండక పోవాలి అనే తన ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పేరు? ఆడది అయినంతమాత్రంచేత ఉద్యోగం చేయకూడదని ఎక్కడా లేదే? అదేం తప్పుడు పని, హీనమైన పనికాదే! డిగ్రీలు పుచ్చుకుని వాటికి 'ఫ్రేం' కట్టించి గోడకు తగిలించుకోడమేనా చదువుల సార్ధక్యం?

"నీవూ వుద్యోగం చేస్తే, పిల్లల పోషణ, ఇంటి వ్యవహారాలు ఎవరు చూస్తారు?'' తను వుద్యోగం చేయటానికి ఆయన అభ్యంతరం అదే ఐతే, అందుకు తాను సమాధానం కూడా చెప్పింది. "మా అమ్మ వున్నది. అందరికీ పెద్దదిక్కుగా వుంటూ అన్నీ సర్దుకపోతూ వుంటుంది. ఒక్కడి సంపాదన మీదే అందరూ ఆధారపడి, అన్ని అవసరా లనూ గడుపుకోలేక, అవసరానికి ఆదుకునేందుకు పది కాసులు వెనుక వేసుకోలేక, చాలీచాలని ఇరుకు జీవితాలు గడిపే కంటే, అవకాశం వున్నప్పుడు భార్యాభర్త లిరువురు ఉద్యోగాలు చేసుకుంటే తప్పేం వుంది? కుటుంబ నిర్వహణకు నా వుద్యోగం ప్రతిబంధకమైనప్పుడు, దాన్ని తప్పకుండా రిజైన్ చేస్తాను'' అని. "నీ వెన్నైనా చెప్పు. నీవు వుద్యోగం చేయడం నా కిష్టం లేదు.'' అర్థం లేకుండా, తగిన కారణం చూపకుండా చెయమన్న ఏ పనినీ తను చేయలేదు. అసలా ఆలోచననే హర్షించదు. ఉద్యోగంలో చేరటానికే నిర్ణయించుకుంది.

"ఇలా వెళ్లవలసి వస్తుందని నేను వూహించనైనాలేదు. అనుకోకుండా ఈ వూరు నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారు. వెళ్లక తప్పదు.'' ఇవే ఆయన మాటలు ఆరోజు. తను వుద్యోగంలో చేరవలసినది ఆరోజే. ఆయన మాటలు తనను ఎంతగానో కృంగదీశాయి. తనకు తెలుసు, ఆయన కావాలని బదిలీ చేయించుకున్నారని, తను ఆయన సలహాని పాటించి, వచ్చిన వుద్యోగాన్ని తిరస్కరించనందుకు శిక్ష కాబోలు, ఆయన


# వుడ్‌వార్డ్స్‌తో

## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స్. కుట్టునొప్పి, వుల్లదనం. కడుపు ఉబ్బరం. పళ్లు వేయునపుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!




LPE Aiyaru F. 10 Tel

అలా బదిలీ చేయించుకుని పారిపోవటం. పట్టుదలల్ని పెంచుకుంటూ తమ పట్టు విడవని వాళ్లంటే తనకు గిట్టదు. అందు కనే, ఆ కోపంతోనే అనేసింది "మీరు కోపం వచ్చి వెళ్లినాసరే నేను వుద్యోగంలో చేరడం మానను. మా అమ్మ కష్టపడి చదివించిన యస్సెల్సీ తెచ్చిపెట్టిన వుద్యోగం యిది" అని.

ఒకరి సమాచారాన్ని మరొకరికి అంద జేస్తూ దేశాని కంతటికీ వెన్నెముక లాంటి డిపార్ట్‌మెంటులో ఉద్యోగం దొరికినందుకు తనకు చాలా ఆనందం కలిగింది. అయితే తన ఆనందాన్ని పంచుకోటానికి భర్త చేరువలో లేనందుకు విచారమూ కలిగింది. ఉత్తరం ద్వారానైనా తన ఆనందాన్ని ఆయనతో పంచుకోవాలనుకుని వ్రాసింది కాని దానికి సమాధానం రాస్తారో లేదో సమాధానం రాయకపోతే తన అభిమానం ఎంత దెబ్బతింటుంది? అది తను సహించ లేదు. అందుకే వుత్తరాన్ని పోస్ట్ చేయ లేదు.

సరోజ లేచి టైం చూసింది. పదిన్నర దాటింది. ఈ రోజెందుకో మనసు గతాన్ని పునశ్చరణ చేసుకుంటోంది. అందుకు మను షులు కూడా దోహదం చేస్తున్నారు. రంగరాజమ్మగారు అడిగిన ప్రశ్న చెవుల్లో గింగురుమంటోంది. జవాబుగా తను చెప్పిన కథంతా విని విషాదంగా నవ్వింది ఆవిడ. "చాలా విచారంగా వుంది సరోజాదేవి? ఈ రోజుల్లో కూడా ఇంకా అలాంటి వాళ్లు వున్నారంటే అది మన దురదృష్టమనే అను కోవాలి. కాని మనం లొంగిపోకూడదు. మన ప్రయత్నం మనం చేయాలి తప్పదు. పెద్దల కోసం కాకపోయినా పసికందుల కోస మైనా తప్పదు. త్వరలోనే విడివాళ్ళి మరచి మీ దంపతులు నాకు విందు చేయాలి" అని నవ్వుతూ భుజం తట్టింది. ఆమె మన సుకు తాత్కాలికంగానైనా వూరట కల్గి నట్లైంది.

రంగరాజమ్మగారి మాటలు ఒక సందే శాన్ని ధ్వనింపజేశాయి సరోజకు. అవును. 'తల్లి మొహం చూడకుండా తనయ, తండ్రి మొహం చూడకుండా తనయుడు ఎన్నాళ్ళు

# కర్త-కర్మ-క్రియ

వుండగలరు? అలా వారిని వేరు చేసే హక్కు తల్లిదండ్రులకుందా?' అనుకుంది సరోజ.

సరోజకు మనసంతా చీకాకైపోయింది. ఏదో వెలితి తన నిత్యజీవితంలో కొట్టవచ్చి నట్లు కనిపిస్తోంది. ఆ వెలితిని పోగొట్టు కోవాలి. కాని మార్గం ఏమిటి? తను వుద్యో గం మాత్రం వదులుకోకూడదు ఇప్పట్లో.

ఏవేవో ఆలోచిస్తుంటే మనసు సుషుప్తి లోకి జారిపోయింది.

* * *

"ఉమా! నేవెళ్తున్నానమ్మా. ఒక్క దానివీ జాగ్రత్తగా వుండు తల్లీ ఇంట్లోనే. ఈ రోజు సాయంత్రం మీ స్కూలు ఎక్కడో విచారించి అవసరమైన సదు పాయాలన్నీ ఏర్పాటు చేస్తాను. రేపట్నుంచీ నీవు బడికి వెళ్లుదువుగాని. వెళ్లిరానా మరి? కొత్తవూరు, కొత చోటని భయమేమీ లేదుకదా!"

"భయమేం లేదునాన్నా. వెళ్లిరా" ఉమ నవ్వును తెప్పించుకుంటూ అంది.

ఉమ లేత పెదవుల మీద వెలిగిన చిరునవ్వు సగం ధైర్యాన్నివ్వగా వడివడిగా అడుగులు వేసుకుంటూ ఆఫీసుకు నడిచాడు మధుసూదనం. దారిలో కనిపించే కొత్త కొత్త మొహాల్ని అవలోకగా చూస్తూ, 'ఈపూట టైంలేదు తర్వాత నిదానంగా పరిచయం చేసుకుంటాను' అన్నట్లుగా చూస్తూ నడుస్తున్నాడు. మలుపు తిరగం గానే కనిపించిన మనిషి, అతన్ని అడుగు ముందుకు వేయనివ్వలేదు. మధుసూదనం నోట మాటరాక అలాగే నిలబడిపోతే. నిలువెత్తు మనిషినీ పూర్తిగా తడిపింది చెమట.

సరోజ! తన అర్ధాంగి!! ఉమ తల్లి!!!

మధుసూదనాన్ని చూసిన సరోజ కూడా అలాగే ఐపోయింది.

"నీవు ఇక్కడి కెందుకు వచ్చావ్?"

"మీరెందుకు ఇక్కడికి వచ్చారు?" ఇరు వురి ప్రశ్నలూ ఒకటైనై.

నిండు సంవత్సరంపాటు ఎడబాటును సహించి, నడిరోడ్డు మీద ఒకరికొకరు తారసిల్లిన ఆ దంపతులు అంతకంటే ఎక్కువ మాట్లాడుకోలేకపోయారు. వారి కన్నులు మాత్రం వాటి భాషలో స్వేచ్ఛగా మాట్లాడుకున్నై.

సరోజను చూడగానే మధుసూదనానికి ఇంటి దగ్గర వంటరిగా వున్న ఉమ గుర్తు వచ్చింది. తనకోసం పరితపించే కుమార్ కనిపించాడు.

సరోజకు అనిపించిందొక్కటే. 'ఉమ, కుమార్ తనకి రెండు కన్నులు. వారిద్దరినీ విడదీసే హక్కు తమ దంపతులలో ఎవరికీ లేదు. కలసివచ్చిన ఈ సమయాన్ని, సదవ కాశాన్ని పోనీకూడదు. ఏదో పరిష్కారం కుదరాలి' అని.

"ఆఫీసుకు వేళైంది..." మధుసూదనం కదలబోయాడు.

"నేనూ ఈ రోజే జాయిన్ కావాలి. అనుకోకుండా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు"

మధుసూదనం ఆశ్చర్యంతో చూశాడు. ఇటు తనకు, అటు సరోజకున్న వూరి నుంచి ఇక్కడికి, ఒకేసారి ట్రాన్స్‌ఫర్ జరగటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అంతా గందరగోళంగా వుంది నాకు. సరే పద" అని కదలబోతున్న మధుసూద నంతో "సాయంత్రం ఇక్కడే కన్పించండి ఇదింటికి. ఇంటికి వెళ్దాం" అంది సరోజ సజలాలైన కళ్లతో.

రెండడుగులు నడిచి వెనుదిరిగిన మధు సూదనానికి ఆమె కళ్లలో ఇంద్రధనస్సు కనిపించింది.

ఉమను చూసి కరిగిపోయిన మాతృ హృదయం, కుమార్‌ను చూసి ఆర్ద్రమైన పితృ హృదయం, వాండోరులను చూసి ఆనందంతో పొంగిపోయిన పసిహృదయాలూ, పై శాల్తీలనందర్నీ చూసి కళ్లొత్తుకున్న మరో స్త్రీహృదయం, అజ్ఞాతంగా అందరి హృదయాల్లోనూ చోటు చేసుకున్న రంగ రాజమ్మ హృదయం వెన్నెలను చూసి వుప్పొంగిపోయాయి.

వెన్నెల తృప్తిగా నవ్వుకుంది. ●